క్లుప్తంగా

రక్త నమూనాల సేకరణ



వీపనగండ్ల: మండలంలోని బొల్లారం, తూంకుంటలో వైద్యాధికారులు టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. దగ్గు, తెమడ వస్తున్న వారి నుంచి రక్తనమూనాలను సేకరించి పరీక్ష చేస్తున్నట్లు ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్, హెల్త్ అసిస్టెంట్ జహంగీర్ తెలిపారు. బొల్లారంలో 16 మంది, తూంకుంటలో 7గురికి నమూనాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ఉమ్మడి మండలంలోని టీబీ బారిన పడ్డ వారికి దాతలు అందించిన పౌష్టికాహారాన్ని గురువారం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. టీబీ ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చని వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



పాన్‌గల్: గ్రామాలల్లో సీసీ రోడ్ల పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శాగాపూర్‌తండాలో సీసీ రోడ్ల పనులకు ఆయన భూమి పూజ నిర్వహించారు. గ్రామాల్లో పార్టీలకతీతంగా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమాలమ్మ, చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్, పీఆర్ ఏఈ సత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి



పాన్‌గల్: విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమం కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ఉపాధ్యాయులకు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల కేంద్రం, కేతేపల్లి ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కరపత్రాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పేదలకు చదువును దూరం చేసే కొత్త జాతీయ విద్యావిధానం 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పీఆర్సీ, బదిలీలు, ప్రమోషన్ల సాధనకు టీఎస్ యూటీఎఫ్ ఎన్నో పోరాటాలను చేసిందన్నారు.

కనులపండువగా గిరిజా కల్యాణం



అమరచింత: పట్టణంలోని శివాలయంలో గురువారం గిరిజా కల్యాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం శివ మహాపడి పూజ అనంతరం మరుసటి రోజు శివ పార్వతులకు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ దంపతులు పార్వతిదేవి తరుపున పూజల్లో పాల్గొన్నారు. వేడుకల్లో అమ్మవారికి మాంగళ్యధారణ చేశారు. పూజారి జంగం జగదీశ్ ఆధ్వరంయలో వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి.

ప్రకృతివనాల పరిరక్షణలో నిర్లక్ష్యం తగదు

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): ప్రకృతివనాల్లో మొక్కల పరిరక్షణలో నిర్లక్ష్యం తగదని నిర్వాహకులను ప్రత్యేకాధికారి రఘునాథ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని బుగ్గపల్లి తండా పంచాయతీని పరిశీలించారు. కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు గ్రామస్తుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయినేజీలను తీయించడంతో పాటు రోడ్లను శుభ్రం చేయాలన్నారు. అనంతరం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాన్ని సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టాలని నిర్వాహకులకు సూచించారు.

పరామర్శ

కొల్లాపూర్: పట్టణంలోని 7వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రాజ్యలక్ష్మి కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

కాసులకు కక్కుర్తి..!

- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో అబార్షన్లు
- ప్రాణాల మీదకు తెస్తున్న చికిత్సలు



జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణి మృతితో ఆందోళన చేస్తున్న బంధువులు, ప్రజా సంఘాల నాయకులు (ఫైల్)

వనపర్తి క్రైం: జిల్లాలో అబార్షన్లు గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారు. అనుకోకుండా గర్భం దాల్చితే విచ్చిత్తి కోసం ఆర్ఎంపీలను ఆశ్రయించి తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. స్కానింగ్‌లో ఆడపిల్ల అని నిర్ధారించుకున్న తర్వాత అనారోగ్య సమస్యల సాకుతో భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. డబ్బుల కోసం గ్రామీణ వైద్యులు, స్కానింగ్ సెంటర్ల పాత్రదారులు, సూత్రధారులుగా సాగే ఈ పాపంలో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు పాలు పంచుకుంటున్నాయి. సంఘటన చోటు చేసుకున్న సమయాల్లో మధ్యవర్తులు వచ్చి రాజీ కుదర్చడం షరా మాములుగా మారింది.

నిబంధనలు గాలికి..

అబార్షన్ల నియంత్రణలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షణ లోపించింది. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమైన ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల తీరు మారడం లేదు. ఫలితంగా విచ్చలవిడిగా అబార్షన్లకు కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు చిరునామాగా మారుతున్నాయి. కేవలం ప్రచారం, రికార్డుల తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు తనిఖీ, నియంత్రణ చర్యలు పూర్తిస్థాయిలో తీసుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. జన్యుపరంగా లోపాలు, వెన్నుపూస లేకపోవడం, కపాలం ఏర్పడకపోవడం, గుండెలో రంధ్రం ఇతర సమస్యలు ఉంటే సంబంధిత గైనకాలజిస్టు, పీడియాట్రిక్, రేడియాలజిస్ట్ పర్యవేక్షణలో అబార్షన్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇవేవి నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా చేస్తున్నారు.

సంచలనం రేపిన సంఘటన

ఈనెల 4న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మూడు నెలల గర్భిణికి అబార్షన్ చేసి వైద్యుల పర్యవేక్షణ లేకపోవడంతో మృతి చెందింది. ఈ విషయం జిల్లాలో సంచలనంగా మారింది. జిల్లా కేంద్రంలోని ఏదులకు చెందిన శోభకు భర్త నాగరాజు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే మూడోసారి గర్భం దాల్చడంతో బుద్దారం చెందిన ఆర్ఎంపీ సాయంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించారు. మొదట గర్భం తొలగించేందుకు మందులు వాడమని చెప్పి పంపించారు. తర్వాత గర్భం పోకపోవడంతో అదే ఆస్పత్రిని ఆశ్రయించారు. పరీక్షలు వైద్యులు 3న రాత్రి అబార్షన్ చేశారు. వైద్యుల పర్యవేక్షణ లోపంతో ఉదయం శోభ పరిస్థితి విషమించి మృతి చెందింది.

■ మూడేళ్ల క్రితం పెబ్బేరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేస్తుండగా, సమాచారం అందుకున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి వారిని పట్టుకున్నారు. అనంతరం ఆస్పత్రిని సీజ్ చేశారు.

అర్హతకు మించి వైద్యం

జిల్లాలో నమోదవుతున్న అనధికారిక అబార్షన్లు ఎక్కువ శాతం ఆర్ఎంపీ, పీఎంపీల సహకారంతో అవుతున్నవే. బాధితుల బలహీనతను సొమ్ము చేసుకునే ప్రయత్నంలో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. బాధితుల ఆరోగ్య పరిస్థితి విషమించిన సందర్భాల్లో మాత్రమే ఇలాంటి విషయాలు వెలుగు చూస్తున్నారు.

అనుమతితో చేయాలి..



గర్భంలో ఉన్న బిడ్డకు జన్యుపర సమస్యలు, ఇతర లోపాలు ఉంటే అనుమతి తీసుకుని అబార్షన్ చేయాలి. నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా చేయరాదు. జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న సంఘటనపై విచారణ చేశాం. త్వరలో నిజాలు బయటికి వచ్చిన వెంటనే వివరాలు వెల్లడిస్తాం.

– రవిశంకర్, డీఎంహెచ్‌ఓ, వనపర్తి

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనలు



ముస్తాబైన ఆలయాలు

మదనాపురం: మండలంలోని శంకరమ్మపేటలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. శుక్రవారం గణపతి పూజ, పుణ్యావచనం, శనివారం వేద పారాయణం, సర్వదేవత మండప ఆరాధన, ఆదివారం ఆరాధన ప్రతిష్ఠ యంత్రాపన అనంతరం ఆంజనేయస్వామి, శివుడు రాధాగోపాలకృష్ణ సంతాన నాగ నవగ్రహ, ధ్వజస్తంభ దీపస్తంబ రాళ్ల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్టాపనకు విరాళంగా రూ.50వేలను గురువారం కొత్తకోట విండో అధ్యక్షులు వంశీధర్ రెడ్డి అందజేశారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



వీపనగండ్ల పాఠశాలలో డ్యూయల్ డెస్క్‌లను పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి యుగంధర్ అన్నారు. గురువారం మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాల, బుసిరెడ్డిపల్లిలో ఉన్నత పాఠశాలలను ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. చింతకుంటలో మన ఊరు–మన బడి పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల్లో గదులను, డ్యుయల్ డెస్క్‌లను, బుసిరెడ్డిపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ పాఠశాలతో పాటు పుల్గర్‌చర్ల పాఠశాలను ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, సెక్టోరియల్ అధికారి యుగంధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక దశలో విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని, అందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వారికి బాధ్యతతో విద్యను అందించాలని అన్నారు.

‘అరెస్టులు సరికాదు’



ఆత్మకూర్ పోలీసుల అదుపులో నాయకులు

ఆత్మకూర్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని హైదరాబాద్‌లో సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు వెళ్తున్న తమను అరెస్టు చేయడం సరికాదని జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి, భారతీయుడు అన్నారు. గురువారం ధర్నాకు వెళ్లకుండా పోలీసులు నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి కూని చేయడమే అన్నారు. అర్హులైనవారందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తరలిన నాయకులు

అమరచింత: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించే ధర్నాకు గురువారం మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. సీపీఎం నాయకులు వెంకటేష్, రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 22 ప్రాంతాల్లో ప్రజలు గుడిసెల పోరు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పరంగా ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి



హాజరైన కార్యదర్శులు, ఎఫ్ఏ, టీఏలు

కొత్తకోటరూరల్ (పెద్దమందడి): మండలంలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేసేందుకు కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ అఫ్జల్ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్‌అసిస్టెంట్స్, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశమయ్యారు. గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో ఉపాయోగపడుతుందన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు రెండు పూటల నీళ్లు పట్టేవిధంగా చూడాలన్నారు.

‘కంటివెలుగు’ లక్ష్యాన్ని చేరుకోవాలి



వీపనగండ్లలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు వైద్యాధికారి శ్రీనివాసులు



ఆత్మకూర్‌లో..

వీపనగండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంలో నిర్ధారించిన లక్ష్యాన్ని చేరుకుని పరీక్షలు విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణలో వైద్య సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించరాదని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినప్పుడే శిబిరానికి ప్రజలు వస్తారని, ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల సహకారాన్ని తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, వైద్యులు రాజశేఖర్, సువర్ణ, విజయకుమారి పాల్గొన్నారు.

పాన్‌గల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కేతేపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పరీక్షలను పరిశీలించారు. పాన్‌గల్, కేతేపల్లి, బుసిరెడ్డిపల్లిలో 467 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని వెంకటాపురం పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 158 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి రాముడు తెలిపారు.

ఆత్మకూర్: కంటివెలుగు కార్యక్రమంతో అంధత్వ సమస్యలు తీరనున్నాయని మున్సిపల్‌చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 4వ వార్డులో కౌన్సిలర్ మహేశ్వరి ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అమరచింత: మండలంలోని చంద్రగడ్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి కోరారు. గ్రామంలో 200 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

284 మందికి కంటి పరీక్షలు

ఖిల్లాఘనపురం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం 284 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, సౌజన్యలత తెలిపారు.

పేద ప్రజలకు వరం

కొత్తకోట: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజలకు వరమని జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని నాటవెళ్లి పెద్దతండాలో శిబిరాన్ని ప్రారంభించారు. ఈ పథకం దేశంలోనే గొప్ప కార్యక్రమం అన్నారు. అనంతరం తండాలో రూ.5లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ వాసుదేవారెడ్డి, ఎద్దుల నాగేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖిల్లాఘనపురం: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి కొండయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. కొత్తగూడం విద్యుత్ థర్మల్ ప్లాంట్ వద్ద 400 మెగావాట్లు ఉత్పత్తి అయ్యే యూనిట్లు ట్రిప్ అయ్యాయని, అందుకు మండలంలో మూడు ఫేస్‌ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బాలకృష్ణ అభిమానుల సంబరాలు

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీరామ టాకీస్‌లో నందమూరి బాలకృష్ణ అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. వీర సింహారెడ్డి చిత్రం కలెక్షన్లు సాధించడంపై థియేటర్ వద్ద పటాసులు కాల్చారు. కార్యక్రమంలో అభిమానులు గౌస్, దస్తగిరి, బాలరాజు, రమేష్, మోహన్, వెంకటేష్, డబ్బారాజు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

ఆత్మకూర్: మూలమల్లలో గురువారం కబడ్డీ క్రీడాకారులకు గ్రామానికి చెందిన గట్టుఆనంద్ టీషర్టులను అందజేశారు. గ్రామానికి చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటారని ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని అన్నారు.

11 నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు

కొల్లాపూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్‌ల వారీగా ఈనెల 11వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రామరాజుయాదవ్ వెల్లడించారు. 11 నుంచి ఫస్ట్ సెమిస్టర్, 26 నుంచి మూడో సెమిస్టర్, 27 నుంచి ఐదో సెమిస్టర్ ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఐడీ కార్డులు కూడా తీసుకురావాలని సూచించారు.

తండాల్లో సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాన్‌గల్: గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, శాగాపూర్‌తండా, అన్నారంతండా, గోప్లాపూర్‌తండా, దావాజిపల్లితండా, అకునోనిపల్లెతండా, దొండాయిపల్లితండాల్లో నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. 12వ తేదీ మండలంలోని తెల్లరాళ్లపల్లిలో నిర్వహించే గిరిజన సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.

గిరిజన హక్కులకై ఉద్యమిద్దాం

వీపనగండ్ల: ప్రభుత్వాలు ఇస్తున్న హామీలను నెరవేర్చుకునేందుకు గిరిజనులంతా ఏకమై ఉద్యమించే సమయం ఆసన్నమైందని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలియానాయక్ అన్నారు. గురువారం వల్లబాపురంతండా, కొర్లకుంట, నాగర్లబండ తండాలలో గిరిజనులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన తల్లరాల్లపల్లిలో జరిగే జిల్లా మహాసభల పోస్టర్‌లను విడుదల చేసి ఆయన మాట్లాడారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించి గిరిజనలకు తీవ్ర అన్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రతి ఒక్కరూ నిలదీయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అంజయ్యానాయక్, రాణి, నారాయణ, గోవిందునాయక్, చంద్రు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

అమరచింత: పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్ఎంగా షిఫా ఫాతిమా, ఎంఈఓగా రిహాన్, డీఈఓగా లతీక్, చక్కటి ప్రదర్శన ఇచ్చారు. వారికి బహుమతులు అందించారు.

‘సేవాలాల్’ కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం గురువారం కొల్లాపూర్‌లో గిరిజన సంఘం నాయకులు కమిటీని ఎన్నుకున్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కిషన్ నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గిరిజన నాయకులు సమావేశమయ్యారు. ఈనెల 22న కొల్లాపూర్‌లోని గిరిజన భవన్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. చంద్రశేఖర్‌నాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంతో ప్రయోజనాలు

జడ్చర్ల టౌన్: సుస్థిర వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ ఏడీ ఆంజనేయులు, శాస్త్రజ్ఞుడు డా.గోవర్ధన్ తెలిపారు. మండలంలోని పెద్ద ఆదిరాలలో గురువారం సర్పంచ్ కృష్ణాబాయి అధ్యక్షతన రైతువేదికలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో పాలెం శాస్త్రవేత్తలతో కలసి ఆయన రైతులకు సుస్థిర వ్యవసాయం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి అవగాహన కల్పించారు. తక్కువ భూమి ఉండి నీటి పారుదల సౌకర్యం ఉన్న రైతులు సుస్థిర వ్యవసాయం ద్వారా సంవత్సరం పొడువునా లాభాలు గడించవచ్చన్నారు. కూరగాయల సాగు పద్ధతులను వివరించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి గోపినాథ్, రైతుబంధు అధ్యక్షుడు రామలింగారెడ్డి, ఏఈఓ మహేశ్వర్ పాల్గొన్నారు.

భారీ వాహనాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు



భారీ వాహనాల్లో వెళ్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు

గోపాల్‌పేట: మండల కేంద్రం మీదుగా ఏదుట్ల వైపు రెండు భారీ వాహనాల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు తరలివెళ్లాయి. దీనిపై వారిని ఆరా తీయగా భోపాల్ నుంచి వచ్చాయని 165 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లని సమాధానమిచ్చారు. 106 టైర్లతో భారీ వాహనాలు వెళ్లడంతో స్థానికులు ఆసక్తిగా చూశారు.

డైనింగ్‌హాల్ లేక ఇక్కట్లు!

- ఇబ్బందులు పడుతున్న కస్తూర్బా విద్యాలయం బాలికలు
- నిధులున్నా పట్టించుకోని వైనం



విద్యాలయంలో వరండాలో భోజనాలు చేస్తున్న బాలికలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో డైనింగ్ హాల్ (భోజన శాల) లేక బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణానికి నిధులు మంజూరై ఐదేళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించడం లేదు. దీనికి తోడు కోతుల బెడద అధికంగా ఉండటంతో భోజనం చేసే సమయంలో బాలికలు అవస్థలు పడుతున్నారు. తరగతి గదులు, వరండాల్లో భోజనం చేసే సమయంలో కోతులు దాడి చేయకుండా సిబ్బంది కర్రలు పట్టుకుని కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.16.60 లక్షలు మంజూరు

మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో డైనింగ్ హాల్ నిర్మాణానికి 2018లో అప్పటి ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.16.60 లక్షలు మంజూరు చేశారు. దీంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2020లో భూమి పూజ చేసి, పనులు ప్రారంభించలేదు. పలుమార్లు విద్యాలయంను సందర్శించిన అధికారులు, మండల ప్రజాప్రతినిధుల దృష్టికి విషయం చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

194 మంది విద్యార్థుల అభ్యసన

విద్యాలయంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 194 మంది బాలికలు అభ్యసిస్తున్నారు. భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేకపోవడంతో పాఠశాల ఆవరణ, వరండా, తరగతి గదుల్లో భోజనం చేయాల్సి వస్తుందని బాలికలు వాపోతున్నారు. దీనికి తోడు విద్యాలయానికి ప్రహరీగోడ లేకపోవడంతో భోజనం చేసే సమయంలో ఆవరణలోకి కోతులు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వాపోతున్నారు. నిర్మాణంలో జాప్యం నిధులు సరిపోవడంలేదా లేక ఇతర ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అనే విషయాలపై చర్చించి తగిన పరిష్కారం చూపితే బాలికల ఇబ్బందులు తొలుగుతాయని పలువురు వాపోతున్నారు.

జిల్లా అధికారులకు నివేదిస్తాం



విద్యాలయంలో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం 2018లో నిధులు మంజూరయ్యాయి. ఆయా నిధులు అలానే ఉన్నాయా రద్దు చేశారా అనే విషయంపై జిల్లా అధికారులతో చర్చించి అదేశానుసారం చర్యలు తీసుకుంటాం. గతంలో కాంట్రాక్టు దక్కించుకున్న వారికి నోటీసులు ఇచ్చి కాంట్రాక్టును రద్దు చేసి మళ్లీ టెండర్ పిలుస్తాం.

– సత్తయ్య, పీఆర్ ఏఈ, పాన్‌గల్